క్లుప్తంగా

ఆదివాసీలకు శుభాకాంక్షలు


విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలందరికి మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజనులంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఈఈ వీవీ కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు గరుగుబిల్లి, నాగూరు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శంకరరావు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్న తరుణంలో గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ, పెదగుడబ తదితర గ్రామాల వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

● ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులతో కలసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీలకు ఆదాయాన్ని ఏవిధంగా సమకూర్చాలి, పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి వనరులను సంరక్షించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

సీతంపేట: ఐటీడీఏ ఆవరణలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పనులను ఈఓపీఆర్‌డీ కె.సత్యం పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకానికి దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఎస్సై పద్మావతి హితవు పలికారు. ఈ మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన కేసులు, అనుభవించాల్సిన శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

50 మంది నిరుపేదలకు వస్త్రాల పంపిణీ


వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాత గౌరీశంకరరావు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన గౌరీశంకరరావు తన భార్య జ్ఞాపకార్థం 50మంది నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. నిరుపేదలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, గౌరీశంకరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు రాజకీయ రంగు..


భామిని: కాట్రగడ-బిలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ చైర్‌పర్సన్ గాదో స్వాతి, ప్రీతిసాహు


సీతంపేట: పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎన్నికైన చైర్మన్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, తదితరులు


కొమరాడ: కోటిపాం జెడ్పీ పాఠశాలలో ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు


వీరఘట్టం: తలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొలువుదీరిన ఎస్ఎంసీ కార్యవర్గం


జియ్యమ్మవలస: అల్లువాడలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హెచ్ఎం రూపవతి


పాలకొండ రూరల్: లుంబూరులో ఎస్ఎంసీ నూతన కార్యవర్గం

వీరఘట్టం : రాజకీయాలకతీతంగా నిర్వహించాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలకు కూటమి నాయకులు రాజకీయ రంగు పులిమారు. మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు కొంతమేర ఉత్కంఠంగా జరిగాయి. ముఖ్యంగా తలవరం, బొడ్లపాడు, యు.వెంకమ్మపేట, ఎంవీ పురం, వండువ ప్రభుత్వ పాఠశాల్లో కూటమి నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేశారు. బొడ్లపాడు ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. మండల పరిధిలో మొత్తం 62 ప్రభుత్వ పాఠశాలలుండా 61 చోట్ల ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు తెలిపారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై ఫకృద్దీన్ పాఠశాలల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి

పాలకొండ రూరల్: పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీలు కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలో గల 59 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. 50 పాఠశాలల్లో ఏకగ్రీవంగా నూతన కమిటీలు ఏర్పడగా.. పనుకువలస, వెంకమ్మపేట, పెద్దకాపువీధి, ఓని, వడమ, అర్దలి, పొట్లి, బద్దుమసింగి, బుక్కూరు పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్లు తెలిపారు.

ప్రశాంతంగా..

సీతంపేట: మండలంలోని 169 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఏఎంసీ ఎన్నికల్లో డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, ఎంఈఓలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రమౌళి పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా కె.చిట్టెమ్మ, వైస్ చైర్‌పర్సన్‌గా బి.దివ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, హెచ్.మోహనరావు, కె.భాస్కరరావు, హెచ్ఎం ప్రసాద్, సహోపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో కమిటీ చైర్మన్‌గా నిమ్మక మురళి, వైస్ చైర్‌పర్సన్‌గా సంధ్యారాణి ఎన్నికయ్యారు.

రెండు పాఠశాలల్లో వాయిదా

భామిని:మండలంలోని 66 ప్రభుత్వ పాఠశాలలకుగాను 64 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వీటిలో 44 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా.. 20 పాఠశాలల్లో ఓటింగ్ పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. కోరం లేక రెండు పాఠశాలల్లో ఎన్నిక వాయిదా వేశారు. నులకజోడు ఎంపీయూపీ స్కూల్, తాలాడ ఎంపీపీ స్కూల్‌లో ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈఓ ఎ. శ్రీనివాస్ తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

గరుగుబిల్లి: మండలంలోని 55 పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వై.అమ్మన్నరావు పటిష్ట బందోబస్తును నిర్వహించారు. మండలంలోని 36 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 8 జెడ్పీ ఉన్నత, ఒక కేజీబీవీ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఎంఈఓ ఎన్.నాగభూషణరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఉల్లిభద్ర, గరుగబిల్లి, రావుపల్లి గ్రామాల్లోనే పాఠశాలల ఎన్నికల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 96 పాఠశాలలు ఉండగా అందులో రెండు పాఠశాలలకు కోరం లేక ఆగిపోయాయని ఎంఈఓ-1 నాగభూషణరావు తెలిపారు. పెదబుడ్డిడి (ఆర్),పెదబుడ్డిడి గదబవలసలో ఎన్నికలు నిలిచిపోయాయి. మిగిలిన 94 పాఠశాలలలో ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 174 పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర సభ్యుల ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం సభ్యులందరిచే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొమరాడలో..

కొమరాడ: మండలంలోని 127 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించామని ఎంఈఓ జామి నారాయణస్వామి తెలిపారు. కొమరాడ బీసీ కాలనీలో జరిగిన ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు.

ప్రజా సహకారం అవసరం

● ఎస్సై ప్రశాంత్‌కుమార్


అక్కిరాజుపేట గిరిజనులకు సూచనలు చేస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగానికి ప్రజా సహకారం అవసరమని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. మండలంలోని అక్కిరాజుపేట గిరిజన గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామల్లో ప్రజలు ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత చదువులపై దృష్టిపెట్టి ఉద్యోగ సాధనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాలకొండ - వీరఘట్టం రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక వైటీసీలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంకండి..

పాలకొండ రూరల్:


సోషల్ ఆడిట్‌పై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న పెన్షన్ ఆడిట్ కార్యక్రమానికి మండల పరిధిలో గల సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో సమాయత్తం కావాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 32 పంచాయతీలకు సంబంధించి 22 సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులు, విద్యా సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు మండల పరిధిలో పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు, అందించిన మొత్తం, తాజా స్థితిగతులతో కూడిన రికార్డులతో ఆడిట్‌కు సిద్ధం కావాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా చేపట్టిన 665 పనులపై సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు.

విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి


దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

● ఎస్పీ మాధవ్‌రెడ్డి

సీతంపేట: ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ఎస్పీ మాధవ్ రెడ్డి అన్నారు. మండలంలోని దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, రిసెప్షన్ కేంద్రం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీసుల విశ్రాంతి గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ కేసులు ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. గంజాయి, సారా రవాణాపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, ఎస్సై అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్లను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేసారు. పోలీస్‌స్టేషన్ తనిఖీలో భాగంగా సిబ్బందికి తగు సూచనలు చేసారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. పోలీస్‌స్టేషను పరిసర ప్రాంతాలను పరిశీలించి సమాచారాన్ని తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించాలన్నారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐలు చిన్నంనాయుడు, అనీష్ పాల్గొన్నారు.

సన్మానం


పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సీతంపేట: ఉపాధ్యాయ వృత్తిలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడును గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. పెద్దూరులోనే 18 సంవత్సరాలు పనిచేసి ఎంతోమందిని ఉన్నతంగా తీర్చిదిద్దారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, కె.భాస్కరరావు, మోహనరావు, డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, ఎంఈఓలు ఆనందరావు, సూర్యచంద్రరావు, యూటీఎఫ్ నాయకులు కుండంగి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 27 పంచాయతీలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల (గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5)కు ఈ నెల 12 నుంచి 14 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రమేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పారిశుద్ధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ మరియు వీధిలైట్లు నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఐదు శాతం రిజర్వేషన్ ఇవ్వాలి..

భామిని: జగగణన చేపట్టి రిజర్వేషన్ల సదుపాయం కల్పించాలని రెల్లికుల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బత్తిలిలో గురువారం రెల్లిగర్జన పేరిట సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెల్లికుల సంఘ నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణలో తమకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. ఈమేరకు ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. కార్యక్రమం సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు

సీతంపేట: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఐటీడీఏ పీఓ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. స్థానికంగా ఉన్న గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. అక్కడే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. గిరిజనులు, విద్యార్థులతో ప్రత్యేక గిరిజన ఆచార, సాంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

బలహీనవర్గాలకు అండగా నిలవాలి

● డీవీఎంసీ సమావేశంలో ఆర్డీఓ రమణ


అధికారులు, సంఘ నాయకులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

పాలకొండ రూరల్: దళిత, గిరిజన, బలహీన వర్గాలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని ఆర్డీఓ వీవీ రమణ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో డీఎస్పీ జీవీ కృష్ణారావుతో పాటు పలు శాఖల అధికారులు, వివిధ ప్రజా, దళిత సంఘాల నాయకులతో కలసి డివిజనల్ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ , పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో చోటు చేసుకున్న బలహీన, దళిత, గిరిజనులపై చోటుచేసుకున్న దాడులు, లైంగిక వేధింపులు, ఇతరత్రా సమస్యలపై నమోదైన కేసుల పరిస్థితిపై ఆరా తీశారు. సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, దళిత సంఘాల నాయకులు ప్రేమభూషణరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పారదర్శకత లేదు..

పాలకొండ: పట్టణంలోని పెదకాపువీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలో పారదర్శకత లోపించిందని 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కేవలం అధికార పార్టీ నాయకుల కనుసన్నలలో ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. ఈ ఎన్నికలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై హెచ్ఎం వివరణ కోరగా ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించామని, ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని తెలిపారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు చేపట్టాలి


జ్వరంతో బాధపడుతున్న బాలికను పరామర్శిస్తున్న నాయకులు

● ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి అదనపు భవనాలు, మల్టీ స్పెషల్ భవన నిర్మాణాలు త్వరిగతిన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులపై ఆరా తీశారు. రోగులను పరామర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేరుకు వంద పడకల ఆస్పత్రి అయినా, 50 పడకలు కూడా అందుబాటులో లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. 23 మంది డాక్టర్లకు 18 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో రిఫరల్ కేసులు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వేదిక నాయకులు పీఎస్ ప్రసాద్, ఎం.ప్రదీప్, ఎం.తిరుపతిరావు, పి.సాంబయ్య, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి

● జిల్లా రైతు శిక్షణ సమన్వయకర్త శ్రీనివాసరావు


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రైతు శిక్షణ సమన్వయకర్త శ్రీనివాసరావు

కొమరాడ: వరి పండించే రైతులు తమ పొలంలో మెలకువలు పాటించి నాణ్యమైన విత్తనాలు తయారీ చేసుకోవాలని జిల్లా రైతు శిక్షణ సమన్వయకర్త ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పరుశురాంపురం గ్రామంలోని విత్తనాభివృద్ధి కేంద్రంలో విత్తనాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యం రైతులు వాడే పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాల కోసం ప్రభుత్వంపై ఆధార పడకుండా తమకు అవసరమైన విత్తనాలను నాణ్యతతో తయారీ చేసుకోవచ్చన్నారు. వరి పంట దుబ్బ చేసి సమయం, చిరుపొట్ట దశ, కోత కోసిన సమయాల్లో కేళిలను గుర్తించి తీసేయాలని సూచించారు. ఏఓ పి.శంకరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

● పైరు పరవశం..


పచ్చని వరి చేల ప్రకృతి సోయగం చూపరులను ఆకట్టుకుంటోంది.. మనసును పులకింపజేసే ఆ దృశ్యం పాలకొండ మండల పరిధి భానూరులో ఆవిష్కృతమైంది. రోడ్డుకిరువైపులా పొలాల్లోని పచ్చని పైరు పుడమితల్లికి పచ్చని కోక కట్టినట్లు దర్శనమిస్తోంది.

– పాలకొండ రూరల్

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ముడుపుల పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: స్థానిక లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఆలయ అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామివారికి ఉదయం 6 గంటలనుంచే భక్తిశ్రద్ధలతో ముడుపుల పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం ముడుపులు పూజలను ప్రారంభించిన వారు 9 వారాలు కొన సాగిస్తారని, కట్టిన ముడుపులను సింహాచలం వరాహ నరసింహ స్వామి ఆలయంలో చెల్లించుకుంటారని చెప్పారు.